క్లుప్తంగా

విత్తనాల కొరత లేకుండా చూడాలి



పి.కన్నాపురంలో విత్తనాలు పంపిణీ చేస్తున్న హబీబ్ బాషా

ద్వారకాతిరుమల: ఖరీఫ్‌లో విత్తనాల కొరత లేకుండా చూడాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌కే హబీబ్ బాషా అధికారులు, సిబ్బందికి సూచించారు. మండలంలోని బుట్టాయిగూడెంలో రైతు భరోసా కేంద్రాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అధికారులు, సిబ్బందితో సమీక్షించిన ఆయన రాబోయే ఖరీఫ్ పంటకు వరి విత్తనాల కొరత సంభవించకుండా చూడాలన్నారు. అనంతరం పి.కన్నాపురం గ్రామంలో పలువురు రైతులకు జీలుగ, పిల్లి పెసర, జనుము, పచ్చిరొట్ట ఎరువు విత్తనాలను పంపిణీ చేశారు. ఇప్పటికే 50 శాతం సబ్సిడీపై రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు అందించినట్టు చెప్పారు. కార్యక్రమంలో భీమడోలు సహాయ వ్యవసాయ సంచాలకులు ఉషా రాజకుమారి, మండల వ్యవసాయాధికారి ఎ.దుర్గారమేష్, వీఏఓ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

దాతృత్వంతో తీరిన నీటి కష్టాలు



బోరు నుంచి నీరు తీసుకెళుతున్న మహిళలు

టి.నరసాపురం: సంగారావుపేట గిరిజనుల మంచినీటి కష్టాలు దాత దాతృత్వంతో తీరాయి. మక్కినవారిగూడెం పంచాయతీ సంగారావుపేట వాసులకు త్రీఫేజ్ విద్యుత్ సరఫరా ఉన్నప్పుడే పంచాయతీ మోటార్ ద్వారా నీరు సరఫరా అవుతోంది. సంగారావుపేట గిరిజనుల కోరిక మేరకు మక్కినవారిగూడెంకు చెందిన జిల్లా ఆర్యవైశ్య సంఘ నాయకుడు, సామాజిక వేత్త దామిశెట్టి కేశవరావు కమల దంపతులు వారి తల్లితండ్రులు విశ్వనాథం, వెంకటరత్నంల జ్ఞాపకార్థం గ్రామంలో బోరువేసి మోటర్ అమర్చారు. రూ.1 లక్ష ఖర్చుతో పెద్దమ్మ తల్లి గుడి వద్ద బోరు వేసి సింగిల్ ఫేజ్ విద్యుత్‌తో తిరేగే విధంగా మోటార్ అమర్చారు. ఈ బోరును కేశవరావు దంపతులు శనివారం గ్రామస్తులకు అంకితం చేశారు. రెండు అంగుళాల వాటర్ డెలివరీ వస్తుండటంతో గ్రామస్తులు ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్నారు.

కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం



కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రవిప్రకాష్

ఏలూరు (టూటౌన్) : స్థానిక 9వ డివిజన్ ఫిల్‌హౌస్ పేటలో దళితసేన అనుబంధ సంఘం మహిళా చైతన్య సేన ఆధ్వర్యంలో మహిళా కుట్టు శిక్షణ కేంద్రాన్ని దళితసేన రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు జిజ్జువరపు రవిప్రకాష్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు కాబోయే ప్రభుత్వం మహిళల అభివృద్ధి సంక్షేమం చూడాలని విజ్ఞప్తి చేశారు. మహిళలకు ఉచితంగా కుట్టు మెషీన్లు ఇవ్వాలని, వారి ఆర్థికాభివృద్ధికి సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో మహిళా చైతన్య సేన రాష్ట్ర కార్యదర్శి బేతాళ జయసుధ, ఏలూరు నగర అధ్యక్షురాలు పిల్లి దుర్గ, ఉపాధ్యక్షురాలు మారుమూడి జయంతి, ప్రధాన కార్యదర్శి బల్లా దేవి, కార్యదర్శి పూనూరి బేబీ దుర్గా, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

30న మండల పరిషత్ సమావేశం

ఏలూరు రూరల్ : ఈ నెల 30న ఏలూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు తెలిపారు. ప్రతి మూడు నెలలకు సర్వసభ్య సమావేశం నిర్వహించాల్సి ఉందని, ఈ నిబంధన ఆధారంగా ఈ నెలాఖరులో సమావేశం ఏర్పాటుచేశామని చెప్పారు. సమావేశానికి ఎంపీటీసీలతో పాటు సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు, మండలధికారులు హాజరౌతారని తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున సభ్యులు పాలనపరమైన అంశాలపైనే చర్చిస్తారని వివరించారు.

'కాట్లంపూడి మురుగు సమస్య పరిష్కరిస్తాం'

ఏలూరు రూరల్ : కాట్లంపూడి గ్రామంలో మురుగునీరు సమస్య పరిష్కరిస్తామని ఈఓపీఆర్డీ ఎం సరళకుమారి తెలిపారు. రెండురోజుల క్రితం కాట్లంపూడి ప్రధాన రోడ్డుపై మురుగునీరు నిలిచిపోయిందని స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆ ప్రాంతాన్ని పరిశీలించామన్నారు. ప్రధానరోడ్డు పక్కన డ్రెయినేజీ లేకపోవడంతో స్థానికులు తమ ఇళ్ల పరిసరాల్లో ఇంకుడు గుంతలు తవ్వుకోవాలని సూచించామని చెప్పారు. ఇళ్లలో మురుగునీరు రోడ్డుపైకి వదలవద్దని చెప్పామన్నారు. త్వరలో పంచాయతీ నిధులతో మురుగునీరు పారుదలకు పక్కా డ్రెయినేజీ నిర్మించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

కుండలకు ఆదరణ కరువు.. క్యాన్ల వైపే మొగ్గు



కుండలు చేస్తున్న దృశ్యం (ఫైల్)



అమ్మకానికి సిద్ధంగా ఉన్న మట్టి కుండలు



మంచి నీటి క్యాన్‌లు

- వృత్తికి దూరమైన కుమ్మర్లు
- ఇటుకల తయారీపై దృష్టి

బుట్టాయగూడెం : పేదోడి ఫ్రిజ్ గా పేరొందిన మట్టి కుండలు వేసవి సీజన్‌లో ప్రతి ఇంట్లో కనిపించేవి. ప్రస్తుతం ఆధునిక యంత్రాలు, పరికరాలు అందుబాటులోకి రావడంతో కుండలకు ఆదరణ కరువైంది. వేసవి కాలం వచ్చిందటే మట్టి కుండలకు ఎనలేని డిమాండ్ ఉండేది. అయితే కాలం మారింది. ప్రజలు వారి అనుకూలమైన వస్తువులపై మక్కువ చూపిస్తున్నారు. ఇప్పుడు ప్రతిఇంట్లో విద్యుత్ ఫ్రిజ్ తప్పనిసరిగా ఉంటోంది. కూల్ క్యాన్‌లు అందుబాటులోకి వచ్చాయి. ఈ క్యాన్లపై ప్రజలు ఎక్కువ మక్కువ చూపుతున్నారు. ఈ నేపథ్యంలో మట్టి కుండల వినియోగం తగ్గుతూవచ్చింది. మట్టి కుండలు కొనేవారు కరువయ్యారు. పోలవరం నియోజకవర్గంలోని బుట్టాయగూడెం, వేలేరుపాడు, కుక్కునూరు, కొయ్యలగూడెం, టి.నర్సాపురం, జీలుగుమిల్లి మండలాల పరిధిలో సుమారు 250 కుమ్మర్ల కుటుంబాలు కుండల వ్యాపారంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. బుట్టాయగూడెం మండలంలోనే సుమారు 110 కుటుంబాల వరకు కుమ్మర్లు కుండలు తయారు చేసి జీవనం సాగిస్తున్నారు.

ఇటుకల బట్టీ వైపు దృష్టి

కుమ్మర్లు తయారు చేసిన కుండలకు గతంలో ఎంతో ఆదరణ ఉండేది. మంచినీటికి ఉపయోగించడమే కాకుండా గిరిజన ప్రాంతంలోని ప్రతి గ్రామంలో కల్లును కుండల్లోనే పట్టేవారు. ప్రతి ఏటా వేసవి కాలంలో కుండలు అత్యధికంగా విక్రయాలు జరిగేవి. రానురానూ మట్టి కుండలకు ఆదరణ తగ్గడంతో కుమ్మర్లు ఇటుకల తయారీపై దృష్టి సారించారు. అత్యధిక కుటుంబాలు ఇటుకల పరిశ్రమను ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. కుండల తయారీపై నామమాత్రంగానే పనిచేస్తున్నారు. ప్రతి గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంటేషన్‌లు రావడం, కూల్ క్యాన్‌లు అందుబాటులో ఉండడంతో వాటిపై మక్కువ చూపుతున్నారు.

కుండలు కొనేవారు కరువు



ఎండా కాలం వచ్చిందంటే అనేక మంది కుండలు కొనేవారు. అయితే ఇప్పుడు కూల్ క్యాన్లు అందుబాటులోకి వచ్చాయి. అలాగే ఫ్రిజ్ వాడకం ఎక్కువైంది. ఈ నేపథ్యంలో కుండలు కొనేవారు కరువయ్యారు. వేసవి సీజనులో కనీసం మూడు నెలల పాటు 50 కుండల వరకు అమ్మేదాన్ని, ఇప్పుడు కుండలు కొనేవారి సంఖ్య తగ్గింది.

– యండమూరి వెంకటలక్ష్మి, కుమ్మరి గట్టు, బుట్టాయగూడెం

కనుమరుగయ్యే జాబితాలో కుండలు



తరతరాల నుంచి చేస్తున్న వృత్తిని వదులుకోలేక కొందరు మాత్రమే కుండలు తయారు చేస్తున్నారు. అత్యధికంగా కుమ్మర్లు ఇటుక పరిశ్రమలను ఏర్పాటు చేసుకుని, వాటిని తయారు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం కూల్ క్యాన్‌లు అందుబాటులోకి రావడంతో పేదోడి ఫ్రిజ్‌గా చెప్పబడే కుండలు రాబోయే రోజుల్లో కనుమరుగయ్యే పరిస్థితి నెలకొంది.

– పెనుగుర్తి సోంబాబు, బుట్టాయగూడెం

వేంకటేశ్వర స్వామికి విశేష పూజలు



వేంకటేశ్వరస్వామి

జంగారెడ్డిగూడెం: స్థానిక గోకుల తిరుమల పారిజాతగిరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సందర్భంగా స్వామి వారికి విశేష పూజలు చేశారు. సుప్రభాత సేవ, ఆరాధన, బాలభోగ నివేదన, తీర్థప్రసాదగోష్టి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కు బడులు చెల్లించుకున్నారు. శ్రీనివాసపురం గ్రామానికి చెందిన ఓ భక్తురాలు భక్తి శ్రద్ధలతో శ్రీస్వామి వారికి వట్టివేళ్లతో పూల దండలు ఆలయ అర్చకుడు నల్లూరి రవికుమార్ ఆచార్యులుకు అందజేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు జుజ్జవరపు విజయభాస్కర రావు, సుంకవల్లి శ్రీనివాస్ కుటుంబ సభ్యులు అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమాలను ఈఓ మానికల రాంబాబు పర్యవేక్షించారు.

భక్తులకు ప్రథమ చికిత్స కేంద్రం



భక్తులకు మందులు అందజేస్తున్న వైద్య సిబ్బంది

ద్వారకాతిరుమల: శ్రీవారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయ అనివేటి మండపంలో శనివారం ప్రథమ చికిత్స కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. స్వామివారి దర్శనార్థం క్షేత్రానికి విచ్చేసిన భక్తులకు వైద్య సిబ్బంది ఉచితంగా మందులను అందజేశారు. బ్రహ్మోత్సవాలు ముగిసే వరకు ఈ కేంద్రాన్ని నిర్వహిస్తామని ఆలయ ఈఓ వేంద్ర త్రినాథరావు తెలిపారు.

కొనసాగిన పారిశుధ్యం పనులు



బోరింగ్ వద్ద బ్లీచింగ్ చల్లుతున్న కార్మికుడు

కుక్కునూరు: ఏజెన్సీ ప్రాంతంలో ప్రజలు డయేరియా వ్యాధి బారిన పడ్డ నేపథ్యంలో ఆయా పంచాయతీల పరిధిలో పారిశుధ్యం పనులు శనివారం కూడా కొనసాగించారు. కార్మికులు తాగునీటి ట్యాంకులను శుభ్రం చేసి చెత్తాచెదారాలను తొలగించారు. డ్రెయిన్లలో పూడికతీత పనులు చేపట్టారు. బ్లీచింగ్ చెల్లించి శానిటేషన్ పనులు చేపట్టారు. ఈ పనులను ఎంపీడీఓ నరసింహారావు పర్యవేక్షించారు.

వాసవీ మాతకు కుంకుమ పూజలు



టి.నరసాపురం: బొర్రంపాలెంలో కలశాలతో ఊరేగింపు

టి.నరసాపురం: శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి సందర్భంగా బొర్రంపాలెంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు అమ్మవారికి కుంకుమ పూజ చేశారు. శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి చిత్రపటంతో మేళ తాళాలతో వాసవి మాత నినాదాలతో 102 కళశాలతో గ్రామంలో ఊరేగించారు. కోదండ రామాలయం వద్ద వాసవి అమ్మవారికి కుంకు మపూజలు, మహా అన్నసమారాధన నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం, వాసవీ క్లబ్, వాసవీ వనిత వైభవం ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. సంఘ సభ్యులు మాట్లాడుతూ పూజా కార్యక్రమాలు నిర్వహించడం వల్ల ఊరంతా ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలతో పాడిపంటలతో ఉంటుందని, ప్రతి ఒక్కరూ హిందూ ధర్మాన్ని పెంపొందించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ ప్రెసిడెంట్ శ్రీకాంత్ కిరణ్ గణేష్, వాసవీ వనిత క్లబ్ ప్రెసిడెంట్ మౌనిక వాణి గీత, సురేష్, జగదీష్, ముక్తేశ్వరావు, గ్రామ ఆర్యవైశ్య సంఘ సభ్యులు, వాసవీ మాత భక్తులు, మహిళలు, సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాసవి మాత జయంతి

కొయ్యలగూడెం: శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. కొయ్యలగూడెం, కన్నాపురం, బయ్యన్నగూడెం, యర్రంపేట గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాలు ఆర్యవైశ్య సంఘ ప్రముఖులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కొయ్యలగూడెం టెంపుల్స్ సెంటర్లోని అమ్మవారి ఆలయంలో గణపతి పూజతో తెల్లవారుజాము నుంచే పూజలు ప్రారంభమయ్యాయి. అమ్మవారికి పంచామృత అభిషేకం, కలశ ఊరేగింపు, మూల మంత్ర హోమం, పూర్ణాహుతి పూర్ణకుంభాభిషేకం చేసి మధ్యాహ్నం భక్తులకు అన్న సమారాధన ఏర్పాటు చేశారు.



కొయ్యలగూడెం: కన్యకా పరమేశ్వరి



జంగారెడ్డిగూడెం: వాసవీకన్యకాపరమేశ్వరి

వాసవీమాత జయంతి ఉత్సవాలు

జంగారెడ్డిగూడెం: వాసవీమాత జయంతిని పురస్కరించుకుని ఆలయంలో విశేష పూజలు చేస్తున్నారు. 108 మంది కన్యలు కలశాలను తలపై పెట్టుకుని పూలతో అలంకరణ చేసిన శేషవాహనంలో వాసవీ మాత ఉండగా జంగారెడ్డిగూడెం పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం మహిళలు కుంకుమ పూజలు చేశారు. వాసవీకటాక్షం సభ్యులు పండ్లు, చిట్టి గాజులు తీసుకొచ్చి అమ్మవారికి సారె సమర్పించారు. వాసవీమాత ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. వెయ్యి మందికి పైగా అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు టీవీఏ రామతారకం, ఆలయ కమిటీ అధ్యక్షుడు కర్పూరం నారాయణరావు, సెక్రటరీ బలరాం రాంబాబు, ట్రెజరరీ మాతు శ్రీమన్నారాయణ, ఛాంబర్ అధ్యక్షుడు వందనపు వేంకటేశ్వరరావు, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు దూబగుంట్ల బాపిరాజు, కర్పూరం కృష్ణారావు, మోతుకూరి సత్యనారాయణ, నాగసూరి వసంతకుమార్, కొడుమూరి శేఖరం, స్వామి, దారా రవి, తడికమళ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అటవీ భూముల ఆక్రమణపై విచారణ



అటవీ భూముల ఆక్రమణపై విచారణ చేస్తున్న అధికారులు

కుక్కునూరు: మండలంలోని సీతారామ నగరం గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతాన్ని పలువురు ఆక్రమించి వ్యవసాయ భూములుగా మార్చి సాగు చేస్తున్న విషయమై వచ్చిన వార్తా కథనాలతో అటవీ శాఖ ఉన్నతాధికారులు స్పందించారు. శనివారం సబ్ డీఎఫ్ఓ వెంకట సుబ్బయ్య ఆక్రమణకు గురైన అటవీ భూములను పరిశీలించి విచారణ చేశారు. సీతారామ నగరం గ్రామ సమీపంలోని అటవీ భూములు దాదాపు వెయ్యి ఎకరాల మేర కబ్జా చేసిన ఆక్రమణదారులు అందులో జామాయిల్‌తో పాటు ఇతర పంటలను సాగు చేస్తున్నారు. ఈ విషయం ఇటీవల బహిర్గతం కావడంతో ఉన్నతాధికారులు స్పందించి విచారణకు ఆదేశించినట్టు తెలిసింది. సీతారామ నగరం అటవీభూములను పరిశీలించిన సబ్ డీఎఫ్ఓ వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ సీతారామ నగరం గ్రామ సమీపంలోని అటవీ భూములను పరిశీలించి విచారణ రిపోర్టులను ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్టు చెప్పారు. స్థానిక సిబ్బందితో కలిసి ఇకపై అటవీ భూములు ఆక్రమణకు గురికాకుండా తగిన చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్ మడకం వెంకటేశ్వరావు, ఇతర సిబ్బంది ఉన్నారు.

గోడపై పడిన వ్యక్తికి తీవ్ర గాయాలు



గోడపై పడి తీవ్ర గాయాలు పాలైన ప్రదీప్

ద్వారకాతిరుమల: మండలంలోని దొరసానిపాడులో శనివారం ఒక వ్యక్తి గోడపై పడి తీవ్ర గాయాలు పాలయ్యాడు. స్థానికుల కథనం ప్రకారం.. ద్వారకాతిరుమలలోని వసంత్‌నగర్ కాలనీకి చెందిన ప్రదీప్ దొరసానిపాడు నుంచి స్వగ్రామానికి నడిచి వెళ్లే క్రమంలో స్థానిక ఆర్సీఎం చర్చి వద్ద గోడపై పడ్డాడు. తల గోడకు బలంగా తగలడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. ఘటనా స్థలంలో తీవ్ర రక్తస్రావం కావడంతో స్థానికులు హుటాహుటీన క్షతగాత్రుడిని 108 అబులెన్స్‌లో ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ధాన్యం ఒబ్బిడి పనుల్లో రైతులు



టి.నరసాపురంలో గ్రీన్‌ఫీల్డ్ హైవేపై ధాన్యం రాశులు



టి.నరసాపురంలో గ్రీన్‌ఫీల్డ్ హైవేపై ధాన్యం తడవకుండా రాశులపై కప్పిన టార్పాలిన్

టి.నరసాపురం: గత రెండు రోజులుగా ఆకాశం మేఘావృతమై ఉండటం, చిరుజల్లులు పడుతుండటంతో మెట్ట ప్రాంతమైన టి.నరసాపురం మండలంలో రైతులు ధాన్యం ఒబ్బిడి పనులు బీజీబిజీగా గడుపుతున్నారు. నిర్మాణంలో ఉన్న గ్రీన్‌ఫీల్డ్ హైవేపై ధాన్యాన్ని ఆరబెట్టిన, పోగు చేసి తడవకుండా బరకాలు కప్పుతున్నారు. ఆకాశం మేఘావృతం అయినప్పుడల్లా రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఈ రబీ సుమారు 300 ఎకరాల్లో వరి సాగు చేయగా, దాదాపు 40 శాతం మేర కోతలు పూర్తయ్యాయి.

50 శాతం రాయితీపై విత్తనాల పంపిణీ

పెదవేగి : ప్రస్తుతం రైతాంగానికి పచ్చిరొట్ట పైరు విత్తనాలను 50 శాతం రాయితీపై అందిస్తున్నామని జేడీఏ ఎస్‌కే హబీబ్ బాషా తెలిపారు. పెదవేగి మండలం విజయరాయి రైతు భరోసా కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనుము, జీలుగ, పిల్లి పెసర విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ సంవత్సరం ముందుగానే విత్తనాలను అందుబాటులో ఉంచినందుకు రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

జాతీయ లోక్‌అదాలత్‌ను వినియోగించుకోండి



కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్జి మధుబాబు

చింతలపూడి: జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి సి.మధుబాబు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక కోర్టు వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పెండింగ్ కేసుల పరిష్కారానికి జాతీయ లోక్‌అదాలత్‌లను వినియోగించుకోవాలని కోరారు. జూన్ 29న జరిగే జాతీయ లోక్‌అదాలత్‌లో క్రిమినల్, సివిల్, బ్యాంక్ రికవరి, చెక్ బౌన్స్, బీఎస్ఎన్ఎల్ రికవరి, కుటుంబ తగాదా, మనోవర్తి, ప్రామిసరి నోట్ కేసులను పరిష్కారించుకోవచ్చని చెప్పారు. కోర్టుల్లో కేసుల సంఖ్య తగ్గించడానికి పోలీసులు, న్యాయవాదులు లోక్ అదాలత్‌పై ప్రజలకు అవగాహన కలిప్పించాలని ఆదేశించారు. కేసులు రాజీ చేసుకునే వారికి ప్రతిరోజూ కోర్టులో ప్రీ లోక్‌అదాలత్ సిట్టింగ్స్ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమాచారం కోసం దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్‌లను, కోర్టు సిబ్బందిని సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

22న సత్యనారాయణ స్వామి కల్యాణం



సత్యనారాయణస్వామి ఉత్సవ మూర్తులను అలంకరిస్తున్న అర్చకులు

లింగపాలెం: రెండో అన్నవరంగా ప్రసిద్ధి చెందిన లింగపాలెం మండలం రంగాపురంలో శ్రీ సత్యదేవుని ఆలయంలో 60వ బ్రహ్మోత్సవాలు శనివారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ఆలయంలో పాంచరాత్ర ఆగమయోక్తంగా అర్చకులు భూదేవి, నీలాదేవి సహిత సత్యనారాయణ స్వామి వార్లను పెండ్లికుమార్తెలు, పెండ్లికుమారుడిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. కూచిపూడి నృత్యాలయం విజయవాడ వారిచే నృత్య ప్రదర్శన చేశారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి వచ్చి తిలకించారు. శ్రీసత్యనారాయణస్వామి తిరు కల్యాణ మహోత్సవం ఈ నెల 22వ తేదీ రాత్రి నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ తెలిపింది.

రెసిడెన్షియల్ పాఠశాలకు విద్యార్థుల ఎంపిక



చొప్పరామన్నగూడెం నుంచి రెసిడెన్షియల్ పాఠశాలకు ఎంపికైన విద్యార్థులు

కొయ్యలగూడెం: ఏపీ రెసిడెన్షియల్ స్కూల్స్‌కు తమ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారని చొప్పరామన్నగూడెం ఎంపీయూపీ స్కూల్ హెచ్ఎం జలగం రాంబాబు శనివారం పేర్కొన్నారు. గత నెల ఏప్రిల్ 25న ఐదో తరగతి ప్రవేశానికి గురుకుల పాఠశాలల కామన్ ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహించారని తెలిపారు. చొప్పరామన్నగూడెం గ్రామానికి చెందిన పోలవరపు యామిని దేవిశ్రీ భవ్య, తలారి దేవి ప్రియ, కుర్తివెంటి పల్లవి సిరి, నాగిరెడ్డిగూడెం బాలికల రెసిడెన్షియల్ స్కూల్‌కు, పెనుగొండ జితేంద్ర అప్పలరాజుగూడెం బాలుర రెసిడెన్షియల్ స్కూల్‌కు ఎంపికైనట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈఓ జలగం సురేష్‌బాబు, స్కూల్ కాంప్లెక్స్ ఛైర్మన్ నిమ్మలూరు ఉమాదేవి విద్యార్థులను అభినందించారన్నారు.

24న సాల్వేషన్ ఆర్మీ చర్చి శంకుస్థాపన

దెందులూరు: దెందులూరులో ఈ నెల 24న సాల్వేషన్ ఆర్మీ చర్చికు పెద దళితోపేట (ప్రస్తుత సాల్వేషన్ ఆర్మీ చర్చి) స్థలంలో శంకుస్థాపన జరుగుతుందని సాల్వేషన్ ఆర్మీ కోర్ ఆఫీసర్ మేజర్ కే.రమణయ్య తెలిపారు. రిటైర్డ్ ఆఫీసర్లు, సంఘ పెద్దలు, సంఘస్తులు, గృహసమితి సభ్యులు పాల్గొంటారన్నారు.